ప్రజాశక్తి

మంగళవారం 2 ఏప్రిల్ 2024 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా



ఉద్యోగాల పేరుతో 'హాలీవుడ్' మోసం

- బాధిత నిరుద్యోగుల యువకుల ఆవేదన
- మేధా టవర్స్ వద్ద నిరసన

ప్రజాశక్తి-గన్నవరం

తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలోని మేధా టవర్స్ ఎదుట హాలీవుడ్ కంపెనీ బాధిత నిరుద్యోగ యువకులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాధితుడు పవన్ మాట్లాడుతూ.. రోటోమాక్, హాలీవుడ్ కంపెనీల యజమానులు ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి చివరకు తమకు రిక్త హస్తాలు చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద కుటుంబాలకు చెందిన తాము ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో విఎఫ్ఎక్స్‌లో శిక్షణ తీసుకున్నామని తెలిపారు. ఆరు నెలలపాటు హాలీవుడ్ కంపెనీలో ఉద్యోగం చేసిన తర్వాత నష్టాల పేరుతో తమని ఇళ్లకు పంపించేశారని, తాము కట్టిన డబ్బులు ఇవ్వాలని కోరితే జనవరిలో వస్తే ఇస్తామని చెప్పారని తెలిపారు. ఆ మాట ప్రకారం వస్తే కంపెనీ హెచ్ఒడి రమణారెడ్డి సమాధానం చెప్పకపోగా, డబ్బులు లేవు...ఉద్యోగం లేదు వెళ్లిపోమంటూ నిర్లక్ష్యంగా (మిగతా 6లో)

నమ్మి మోసపోయాం : సాయికిరణ్



నెలకు రూ.20 వేల జీతంతో ఉద్యోగం అంటే నమ్మి లక్షన్నర కట్టి మోసపోయాను. మాది కేసరపల్లి గ్రామం. దగ్గరలోని కంపెనీలో ఉద్యోగం అంటే ఎంతో సంబరపడ్డాను. కానీ చేరిన ఆరు నెలలకే బయటకు రావాల్సి వచ్చింది. వేతనం రూ.10 వేలు కూడా ఇవ్వలేదు. నిరుద్యోగ యువకుల నుంచి కోట్ల రూపాయలు దండుకొని కంపెనీవారు లాభం పొందారు. పోలీసులు ఇటువంటి సంస్థలపై గట్టి చర్యలు తీసుకోవాలి. మా దగ్గర డబ్బులు వసూలు చేసిన కంపెనీలోని హెచ్ఒడిని అరెస్టు చేసి డబ్బులు రికవరీ చేయాలి.

వేరే ఉద్యోగం వదులుకొని వచ్చా : అనిల్



భవిష్యత్తు బాగుంటుందని చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి ఈ కంపెనీకి వచ్చాను. లక్ష రూపాయలు కట్టాను. ఉద్యోగంలో చేరడానికి వస్తే కంపెనీ నష్టాల్లో ఉంది జనవరిలో రమ్మన్నారు. తీరా వస్తే ఉద్యోగం ఇవ్వకపోగా కనీసం సమాధానం చెప్పడం లేదు. నేను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమన్నా మాట్లాడటం లేదు. ఇప్పుడు నా పరిస్థితి రెండింటికీ చెడ్డ రేవడిలా మారింది. వేరే ఉద్యోగానికి పోలేను ఈ ఉద్యోగం ఇవ్వడం లేదు. పోలీస్ అధికారులు స్పందించి కంపెనీ వారిపై కఠిన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి.

పోలింగ్ సిబ్బందికి దశల వారీ శిక్షణ

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు



ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లాలో ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనాకు వివరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. అర్హులైన వారికి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి జిల్లాస్థాయిలో సన్నద్ధత, ప్రక్రియను సజావుగా పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

1,213 ఫిర్యాదులు పరిష్కారం

ఎన్‌టిఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. సోమవారం కలెక్టర్ డిల్లీరావు వివిధ మార్గాల ద్వారా వచ్చే ఎన్నికల ఫిర్యాదుల పరిష్కార ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ మార్గాల ద్వారా 1,235 ఫిర్యాదులు రాగా వాటిలో 1,213 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మిగిలినవి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మీడియాలో 43 ప్రతికూల వార్తలకు సంబంధించి 31 వార్తలపై ఇప్పటికే తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి వివిధ అనుమతుల కోసం ఎన్‌కోర్ ద్వారా వచ్చిన 44 దరఖాస్తుల్లో 30 దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించామని చెప్పారు.

రూ.5.27 కోట్ల విలువైన సీజర్లు

ఏప్రిల్ ఒకటికి నాటికి జిల్లాలో రూ.1.87 కోట్ల నగదుతో సహా రూ.86.89 లక్షల విలువైన మద్యం, రూ.5.58 లక్షల విలువైన మత్తు పదార్థాలు, రూ.2.32 కోట్ల విలువ చేసే లోహాలు తదితరాలతో కలిపి మొత్తం రూ.5.27 కోట్ల విలువైన సీజర్లు జరిగినట్లు కలెక్టర్ డిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు.

జనసేనలోకి బుద్ధప్రసాద్

- దివిసీమలో రాజకీయ ఉత్కంఠతకు తెర
- సీటిస్తే రాజీనామాలు చేస్తామని జనసైనికుల హెచ్చరిక



పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ

జనసేన, టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించగా ఇప్పటి వరకు జనసేన పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదు. మరోవైపు టిడిపి ఇన్చార్జిగా ఉన్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వాలని ఆ పార్టీ శ్రేణులు అధిష్టానానికి మొరపెట్టుకోవడంతో పాటు రాజీనామాలూ చేశారు. మరోవైపు అవనిగడ్డ సీటు కోసం జనసేన పార్టీ తరపున ఆశావాహుల సంఖ్య పెరిగిపోవడంతో ఎవరికి సీటు ఇవ్వాలో తెలియని పరిస్థితి ఆ పార్టీలో నెలకొంది. దీంతో అవనిగడ్డ అభ్యర్థి విషయంలో ఉత్కంఠ కొనసాగింది. ఈ క్రమంలో బుద్ధప్రసాద్ సోమవారం పిఠాపురం వెళ్లి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరడంతో ఉత్కంఠతకు తెరపడింది. గత మూడు రోజులుగా బుద్ధప్రసాద్ పార్టీ మారతారనే వార్త దివిసీమలో చక్కెర్లు కొడుతున్నప్పటికీ ఆయన నుండి ఎటువంటి ప్రకటన రాకపోవడంతో జనసేన, టిడిపి నేతలు కొంత సందిగ్ధంలో ఉన్నారు. గత రెండు రోజుల క్రితం ఆయన ప్రధాన అనుచరులతో సమావేశం నిర్వహించి జనసేన పార్టీలో చేరాలనే విషయాన్ని ప్రకటించారు. ఆఖరి వరకు టిడిపి నుంచి తనకే సీటు వస్తుందని ఎదురుచూసిన బుద్ధప్రసాద్ చివరకు జనసేన పార్టీలో చేరడంతో సీటు దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తుంది.

జనసైనికుల్లో వ్యతిరేకత

మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ టిడిపి నుండి జనసేన (మిగతా 6లో)



విజయవాడలోని మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్



బందరులో సూచనలిస్తున్న డిఇఒ తాహెరా సుల్తానా

'పది' మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్, కలెక్టరేట్ (కృష్ణా)

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని బిషప్ హజరయ్య స్కూల్లోని మూల్యాంకన కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానంద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని అన్నారు. సోమవారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కార్యక్రమం (స్పాట్ వాల్యూయేషన్) ప్రారంభించినట్లు చెప్పారు. ఈ నెల 8వ తేదీ వరకు మూల్యాంకనం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు డా.కె.వి.శ్రీనివాసులురెడ్డి, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లాలో రెండు కేంద్రాల్లో మూల్యాంకన ప్రక్రియ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా తెలిపారు. లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ విభాగాలుగా ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. బందరులోని లేడియాంప్థిల్, నిర్మల హైస్కూల్లో మూల్యాంకనం జరుగుతుందన్నారు. ఇందుకోసం వంద మంది చీఫ్ ఎగ్జామినర్లు, ఆరు వందల మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 202 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించడం జరిగిందన్నారు. మూల్యాంకన ప్రక్రియకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్మల హైస్కూల్లో ఏర్పాటు చేసిన మూల్యాంకన ప్రక్రియను పరిశీలించినట్లు తెలిపారు.

బందరులో వాలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

3పేజీ



రంజాన్ దీక్షల వేళలు

ఇఫ్తార్ : మంగళవారం సాయంత్రం 6.34

సహర్ : బుధవారం ఉదయం 4.48

అన్యశ్రీకి నవోదయలో అర్హత

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు మండల కేంద్రంలోని జయంతి మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థికి గూడూరు అన్యశ్రీకి జవహర్ నవోదయ పరీక్షల్లో ఏలేరు పాఠశాలలో అడ్మిషన్ లభించింది. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులకు నవోదయ పాఠశాలలో అడ్మిషన్ రావడంతో పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అన్యశ్రీకి అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మాధవి లత, పాఠశాల సిబ్బంది మండల యుటిఎఫ్ శాఖ నాయకులు హరిప్రసాద్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



ఆర్‌టిసి బస్టాండ్ తనిఖీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల బస్టాండ్‌ను సోమవారం ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ సబ్రమణ్యం తనిఖీ చేశారు. బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. బస్టాండ్ ఆవరణ శుభ్రంగా ఉండాలన్నారు. ప్రయాణికులు కూర్చునేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. బస్టాండ్ ఆవరణలో స్టాల్స్ నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం సైకిల్ స్టాండ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరిండెంట్ శ్రీదేవి సబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్లంలో శిక్షణ

ప్రజాశక్తి - తిరువూరు : వేసవి సెలవుల్లో విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఇంగ్లీషులో శిక్షణ ఇస్తున్నట్లు తిరువూరు మండల పరిధిలోని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు, జెవివి ప్రతినిధి ఎం.రాంప్రదీప్ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ప్రకటన విడుదల చేశారు. వీరు పదిహేను ఏళ్లుగా దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లో వివిధ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఉచితంగా ఆంగ్లంపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాల ద్వారా, అదే విధంగా సాయంత్రం వేళల్లో వివిధ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘ కన్వీనర్‌గా, సబ్జెక్టు కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌గా పలువురికి ఆంగ్లంలో శిక్షణ ఇచ్చారు. కరోనా కాలంలో సామాజిక మాధ్యమాల ద్వారా అనేకమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు లక్ష మంది పేద విద్యార్థులకు ఉచితంగా ఆంగ్లంపై అవగాహన కల్పించారు. స్థానిక లైబ్రరీలో ప్రతి ఏటా వేసవిలో నిర్వహించే సమ్మర్ క్యాంపులో కూడా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ధనిక విద్యార్థులతో పోటీగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద విద్యార్థులకు సమాన అవకాశాలు రావాలంటే వారికి ఆంగ్లంపై పట్టు కల్పించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ఈ లక్ష్యంతోనే తాను ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా కొన్ని సమయాల్లో తనకున్న సాధారణ సెలవులని కూడా ఉపయోగించుకొని పని చేస్తున్నట్లు రాం ప్రదీప్ తెలిపారు.


విద్యార్థులకు శిక్షణనిస్తున్న రాంప్రదీప్

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగు తున్న నిత్యాన్నదానానికి జగ్గయ్య పేట వాస్తవ్యులు పాల్వాయి మల్లయ్య జ్ఞాప కార్థం ఆయన కుమారుడు వెంకటేష్ రూ.10,116లు విరాళంగా అందజేశారు. దాతలకు స్వామి ప్రసాదం ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.వర ప్రసాద్‌రావు అందజేశారు.


రెవెన్యూ పోరంబోకు భూమి ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఎ.కొండూరు : మండలంలోని కృష్ణారావు పాలెం పంచాయతీ శివారు ఆర్ఎస్ నెంబర్ 306, 307 లోగల రెవిన్యూ పోరంబోకు భూమిలోని డొంకను కొందరు వ్యక్తులు ఆక్రమించి చదును చేశారని సోమవారం కృష్ణారావుపాలెం గ్రామ సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి చంద్రమోహన్‌రావు ఎ.కొండూరు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎటువంటి పంచాయతీ అనుమతులు లేకుండా తమ ఇష్టానుసారంగా పై సర్వే నెంబర్లలోని డొంకను ఆక్రమించి చదును చేశారని ఆమె ఆరోపించారు. ఈ విషయమై తహశీల్దార్ రియాజ్ హుస్సేన్ మాట్లాడుతూ రెవెన్యూ పోరంబోకు భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేయించి స్వాధీనపరచుకుంటామని తెలిపారు. డొంకలో ఉన్న చెట్లను కూడా ఆక్రమించినట్లు తమ విచారణలో వెలడైతే అలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.


అధికారికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి మైలవరం : మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా ఏడి ప్రసాద్, విటి కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2024-25 సంవత్సరానికి కార్యవర్గ ఎన్నిక సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులతో పాటు సహాయ కార్యదర్శిగా ముల్లంగి రవికుమార్, లైబ్రేరియన్‌గా బి.దినేష్, కోశాధికారిగా టి.కోటేశ్వరరావు, మహిళా కార్యదర్శిగా నాగులూరి భావన, మీడియా కన్వీనర్‌గా బుద్ధారపు వెంకటరావు, క్రమశిక్షణ కమిటీ, మానవ హక్కుల కమిటీ, బిల్డింగ్ అభివృద్ధి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఏడు ప్రసాద్ కిషోర్‌లను అభినందించారు.



186 కేసులు నమోదు

త్రైమాసిక నివేదికలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెల్లడి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఎక్సైజ్ స్టేషన్‌కు సంబంధించి త్రైమాసిక నివేదికను జగ్గయ్యపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మనికంఠరెడ్డి సోమవారం విడుదల చేశారు. 2024 సంవత్సరం మొదట 3 నెలల్లో మొత్తం 186 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో 218 వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ కేసుల్లో 2349.67 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. 18 వాహనాలను సీజ్ చేశారు. 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన అనంతరం 16 మార్చి 2024 నుండి మార్చి 31 వరకు మొత్తం కేసులు -32, అరెస్ట్ అయిన వ్యక్తులు -36, సీజ్ చేసిన మద్యం -394.84 లీటర్లు, సీజ్ చేసిన వాహనాలు-5, సీజ్ చేసిన మొత్తం సొత్తు విలువ- రూ.18,79,736 స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు.

జగన్ హయాంలో వడ్డెర్లకు పెద్దపీట: సామినేని

ప్రజాశక్తి - వత్సవాయి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో వడ్డెర్లకు పెద్దపీట వేశారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని, మక్కపేట ఎన్‌కెఆర్ కళ్యాణ మండపంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వడ్డెర ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఉదయభాను, గుంటూరు ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ళ రేవతి, జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు తన్నీరు ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గత చంద్రబాబు వడ్డెర్లను ఓటు బ్యాంకుగా వాడుకున్నాడే తప్ప వారికి ఎటువంటి స్థానం కల్పించలేదని అన్నారు. జగ్గయ్య పేట నియోజకవర్గంలో 40 లక్షల రూపాయలతో నవాబుపేట గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వడ్డెర సోదరుల కోసం రూ.2.70 కోట్లతో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. వడ్డెర సంఘ పెద్దలు మాట్లాడుతూ జగన్ పాలనలో ఎమ్మెల్సీ పదవితో పాటు మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు తదితర పదవులను కేటాయించి వడ్డెర సోదరుల గౌరవాన్ని పెంచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్మన్ ఓర్సు లక్ష్మి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, వడ్డెర సంఘం సీనియర్ నాయకులు శరభందరాజు, రాష్ట్ర యూత్ సెక్రెటరీ తన్నీరు నాగేంద్ర, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కుంచపు నారాయణ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు వేముల మల్లేశ్వరరావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు గుంజా లక్ష్మణ్, వడ్డెర నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సామినేని

ఇంటింటికీ వెళ్లి సామాజిక పెన్షన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం టిడిపి నేతలతో పాటు సచివాలయానికి వెళ్లి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్ కోరారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఇంటి వద్దే ఫించన్లు పంపిణీ చేయాలని జగన్ రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదు? ఖజానాలో నిధులు లేకనే కదా? అని సూటిగా ప్రశ్నించారు. 1.35 లక్షల సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధప్రాతిపదికన ఫించన్లు ఇంటి వద్దే పంపిణీ చేయడం సాధ్యమైనా జగన్ రెడ్డి ప్రయత్నాలు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. పింఛన్ల సొమ్ములు ఇవ్వడానికి ఖజానాలో సరిపడా నిధులు లేక జగన్ రెడ్డి ఎన్నికల టీడీపీపైన దుష్ప్రచారం చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, సెర్ప్ సిఇఒ మురళీధర్ రెడ్డి పింఛన్ల పంపిణీ సచివాలయం సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే చేయాలని టిడిపి డిమాండ్ చేస్తోందని తెలిపారు.

ఇంటికే పెన్షన్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - వీరులపాడు : పెన్షన్లను ఆలస్యం చేయకుండా పంపిణీ చేయాలని టిడిపి మండల మాజీ అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎంట్ర గుంట కృష్ణారావు, చీదిరాల భరత రెడ్డి, ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పెన్షన్లను వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం నిలిపి వేయాలని ఆదేశా లిచ్చారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. అయితే లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లను ఇంటింటికీ అందజేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దుర్గమ్మను దర్శించుకున్న సిన్హా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను సోమవారం రాష్ట్ర రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అంజనా సిన్హా అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరము వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.


మృతుడు కిరణ్

విద్యుత్ స్తంభంపైనుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కరెంటు స్తంభంపై నుండి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దామరచర్ల మండలం గొల్లగూడెం తండాకు చెందిన రావూరి కిరణ్(30) చిల్లకల్లు గ్రామంలో పెట్రోల్ బంక్ దగ్గర గ్రామీణ సిటీ కేబుల్ వైరు బిగించేందుకు స్తంభంపైకి ఎక్కాడు. అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రచారంలో పాల్గొన్న చిన్ని, సౌమ్య

టిడిపి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో టిడిపి అభ్యర్థులు సమవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఎన్డీఏ కూటమి విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని శివనాథ్, నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్య గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం టాపులేని జీపు పై ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి అభివృద్ధి కుంటుబడిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. టిడిపి ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేశినేని శివనాథ్, తంగిరాల రాక సందర్భంగా గ్రామంలో టిడిపి నాయకులు కార్యకర్తలు బణాసంచా పేల్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు నాయకులు కోట వీరబాబు, గోగోనేని అమరనాథ్, రాజ్ కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - వత్సవాయి : మంగొల్లు గ్రామ టిడిపి మాజీ అధ్యక్షులు బొల్లం హనుమంతరావు ఆ పార్టీని వీడి ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సమక్షంలో వైసిపిలోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

76 లక్షల ఉపాధి పని దినాలు : కలెక్టర్



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : ఉపాధి హామీ పనులు కింద 2023 -24 సంవత్సరంలో జిల్లాలో 76 లక్షల పని దినాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. గత నాలుగైదేళ్ళలో ఇదే అత్యధికమని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్. జవహర్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వేసవిలో వడగాల్పులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ, పింఛన్ల పంపిణీ అంశాలపై సమీక్షించారు. స్థానిక క్యాంపు కార్యాలయం (కలెక్టర్ బంగ్లా)నుండి జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విసీలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ప్రగతి కలెక్టర్ వివరించారు. ఉపాధి హామీ పథకం కింద 2023- 24 సం. జిల్లాలో 73 లక్షల పని దినాల కల్పన లక్ష్యంకాగా, 76 లక్షల పని దినాలు కల్పించి రు.191 కోట్ల రూపాయలు వేతనాలు చెల్లించినట్లు తెలిపారు. 22 వేల కుటుంబాలకు వంద రోజుల పని దినాల కల్పన పూర్తి చేసినట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఏప్రిల్ 3 వ తేదీనే కాలువలకు నీరు విడుదల చేయాలని కలెక్టర్ సీఎస్ గారిని కోరారు. రాష్ట్రంలో ఎండ తీవ్రత, వడగాల్పుల పరిస్థితిని ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పించడం, చలివేంద్రాల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డ్వామా పీడీ జీవి సూర్య నారాయణ, డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, జడ్పీ సీఈవో ఇన్చార్జ్ ఆనంద్ కుమార్, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, డిపిఓ నాగేశ్వర నాయక్ పాల్గొన్నారు.




రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు

మచిలీపట్నంలో వాలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం నియోజ వర్గం రూరల్ అర్బన్ ప్రాంతాలకు చెందిన పలు గ్రామ, వార్డులకు చెందిన వందలాదిమంది వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేసారు. సోమవారం ఉదయం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాల యంలో కమిషనర్ బాపిరాజుకు, మండల పరిషత్ కార్యాలంలో ఎంపిడిఓ బాలకష్ణ కు వాలంటీర్లు తమ పదవులకు రాజీనామా పత్రాలను సమర్పించారు. పట్టణ పరిధిలో 823 మంది వాలంటీర్లు ఉండగా 578 మంది, అలాగే రూరల్ పరిధిలో 402 మంది వుండగా 263 మంది తమ రాజీనామాలను అధికార్లకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి నిస్వార్థంగా ఎలాంటి లంచాలు తీసుకోకుండా పని చేస్తున్నామని, ప్రతిపక్షాలైన తెలుగుదేశం పార్టీ-జన సేన పార్టీలు సూటిపోటీ మాటలతో హింసిస్తున్నా రన్నారు. వద్ధులు వితంతువులు దివ్యాంగులు కిడ్నీ పేషెంట్లు తదితరులు అందరికీ ఒకటో తేదీ తెల్లవారు జామున సామాజిక పెన్షన్లు అందరినివ్వకుండా కొంద రు ఉద్దేశపూర్వకంగా అడ్డుపడడంతో కలత చెంది మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నామని ప్రకటించారు.

ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా వాలంటీర్లు :కొల్లు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా వలంటీర్లు వెళుతున్నారని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం మచిలీపట్నంలో వలంటీర్ల చేసిన మూకుమ్మడి రాజీనామాలపై రవీంద్ర మాట్లాడుతూ వలంటీర్లను తొలగించమని ఈసీ చెప్పలేదని కేవలం పెన్షన్ల పంపిణీకి మాత్రమే వలంటీర్లను దూరం పెట్టిందని కానీ మచిలీపట్నం నియోజక వర్గంలో వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు చేయడంతో వారి నిజస్వరూపం బయట పడిందన్నారు. అలాగే రాజీ నామాలు చేయాలని స్థానిక వైసీపీ నేతలు వలంటీర్లపై ఒత్తిడి తెచ్చారన్నారు. ప్రత్యేక ఫార్మెట్ తయారు చేసి ఆ ఫార్మెట్ ప్రకారం రాజీనామాలు చేయిస్తున్నరన్నారు. కేవలం సీఎం జగన్ వలంటీర్లను రాజకీయంగా వాడుకు



నేందుకు మూకుమ్మడి రాజీనా మాలు చేయిస్తున్నారని విమర్శించారు. ఈసీ కూడా దీనిపై దృష్టి పెట్టి మూకుమ్మడి రాజీనామాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కనుక అధికారులు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించవద్దని కోరారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పెదపారుపూడి : రంజాన్ మాసం పర్వ దినాన్ని పురస్కరించుకుని ముస్లింలు మండలంలోని పలు మసీదుల దగ్గర ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామ శివారు లక్ష్మీపురం గ్రామంలోని మసీదు దగ్గర గ్రామానికి చెందిన షేక్ అన్వర్ భాష ముస్లింలకు ఇఫ్తార్ విందును సోమవారం ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున ముస్లింలు ఇఫ్తార్ విందు లో పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ బాలమ్మ

ప్రజాశక్తి-గన్నవరం : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు ఉపాధి హామీ పనులను ఉపయోగించుకుని జీవనోపాధి పొందాలని బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ అన్నారు. సోమవారం గ్రామంలోని చెరువులో ఉపాధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ బాలమ్మ.. వేసవికాలంలో గ్రామాల్లో పొలం పనులు ఉండవని, ఈ క్రమంలో ఉపాధి పనులను కూలీలు పయోగించుకుని ఆర్థికంగా లబ్ధి పొందాల న్నారు. అయితే తక్కువ వేతనాలు వస్తున్నాయని వాదన ఉందని, మేట్లు నిర్ణయించిన విధంగా పనులు చేస్తే పూర్తిగా వేతనం రావడానికి వీలుంటుందన్నారు. ఉపాధి పనులు చేసే చోట కనీస వసతులు కల్పించాలని ఉపాధి పథకం సిబ్బందికి సూచించారు. బుద్ధవరం గ్రామంలో ఎంతోమంది ఈ పనులు చేసుకుని జీవనం సాగిస్తా రన్నారు. ఈ కార్యక్రమంలో బడుగు మరియదాసు, పలువురు వార్డు నెంబర్లు, మహిళలు పాల్గొన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలంలో ఏప్రిల్ 3 తేదీ నుంచి పెన్షన్ పంపిణీ చేస్తామని కోడూరు మండల ఎంపీడీవో ఆర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధ వారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, సచివాలయాల వద్ద, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పెన్షన్‌లు పంపిణీ చేస్తారన్నారు. కావున పెన్షన్ ధరలు అందరూ కూడా ఈవిషయాన్ని గమ నించాలన్నారు.

నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో ఉన్న ఎల్లమ్మ తల్లి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో శనివారం స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, జిల్లా రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, లింగారెడ్డిపాలెం పిఏసిఎస్ చైర్మన్ చిట్టిప్రోలు బ్రహ్మా రావు, ఎంపీటీసీ బడే హేమగంగాధర్, లింగారెడ్డిపాలెం ఎంపీటీసీ దాసరి త్రాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : ఆంధ్రప్రదేశ్ అభివద్ధిపథంలో పయణిం చాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వింత సంజీవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 9 కాంగ్రెస్ గ్యారెంటీ లతో కూడిన మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు కలిసి అభ్యర్థుల నిలబెట్టుకుని రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, కానీ మోడీకి జగన్మోహన్‌రెడ్డి దత్తపుత్రుడని ఆ విషయాన్ని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ గుర్తు ఎరగాలని ఆయన అన్నారు. రాష్ట్రానికి మోడీ 10 సంవత్సరాల నుండి ప్రత్యేక హెూదా ఇవ్వ పోగా చెంబుడు నీళ్ళు, కొంచెం మట్టిని తెచ్చాడని ఆయన గుర్తు చేశారు. దేశంలో గుజరాత్ దొంగలు పడ్డారని వారి దక్షిణాది రాష్ట్రాల వైపు కూడా రావడానికి చూస్తున్నారని ఆయన అన్నారు. ఇటు టిడిపి అటు వైఎస్ఆర్సిపి మోడీ మన రాష్ట్రానికి ఏమిచ్చారని నిలదీయకపోగా మూడు ప్రాంతీయ పార్టీలు మోడీకి దాసోహం అనడం చాలా దారుణం అన్నారు. జనసేన పార్టీ, టిడిపి పార్టీలు బిజెపితో ఏ ఒప్పందం ప్రకారం జత కట్టారో సమాధానం చెప్పాలని సంజీవరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రం లోని ప్రజలు జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్



లకు ఓట్లు వేస్తే కేంద్రంలోని మోడీకి వేసినట్లేనని దానివల్ల రామన్న రోజుల్లో కూడా మన రాష్ట్ర అభివద్ధి చెందకుండా పాతాళానికి వెళ్ళిపోతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అబ్దుల్ మతిన్, నల్లమోతు కుమారి, ఫణి భూషణ్, బురగడ్డ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



ప్రజాశక్తి-కంకిపాడు : అప్పుల బాధ తాళలేక వివాహిత ఆత్మ హత్య చేసుకున్న సంఘటన కంకిపాడులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడులోని సినిమా హాల్ సెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న కళ్లెం రాకేష్ అతని భార్య ప్రసన్న కుమారి(28)లు కొంత కాలంగా చెప్పులు షాపు వ్యాపారం చేస్తున్నారు. దానిలో నష్టాలు రావడం వలన అప్పుల బాధ తాళలేక మనస్థాపం చెంది ప్రసన్న కుమారి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఒక పాప ఒక బాబు వున్నారు. ఈమేరకు ప్రసన్న కుమారి తల్లి డోకిపర్తి సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

నరసింహారావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : మాజీ మంత్రి, టిడిపి నాయకులు కీర్తిశేషులు నడకుదుటి నరసింహారావు వర్ధంతి కార్యక్రమాన్ని నాగాయలంకలోని మత్స్యకారుల భవనం వద్ద సోమవారం నిర్వహించారు. మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నరసింహారావు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీసీ వర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సేవా సమితి జిల్లా నాయకులు నాగిడి తాతారావు, లంకె శ్రీనివాసప్రసాద్, మత్స్యకారుల కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు కర్రి కష్ణమూర్తి, బీసీ నాయకులు అండ్ రాజు, ఆదినారాయణ పాల్గొన్నారు

రాష్ట్రాభివృద్ధి కోసమే పొత్తు

- తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీమ్ బేగ్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసమే చంద్రబాబు నాయుడు బిజెపితో పొత్తు పెట్టుకున్నారని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీమ్ బేగ్ అన్నారు. సోమవారం 15వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో హసీమ్ బేగ్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో హజ్ హౌస్ కట్టాం అని, మైనారిటీలకు సబ్సిడీ లోన్లు, ముస్లిం ఆడబిడ్డలకు దులహన్ పథకం ఇచ్చామని, ముస్లింలలోని పేద విద్యార్థులను ప్రోత్సహించే విధంగా విదేశీ విద్య లాంటి ఎన్నో పథకాలు చంద్రబాబు అందజేస్తే, ఈ వైసీపీ పాలనలో గడిచిన ఐదేళ్లలో ముస్లింల పథకాలు అన్ని రద్దుచేసి ముస్లింలను మోసం చేసిందన్నారు. గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో కరెంటు చార్జీలు, నిత్యవసర సరుకుల ధరలు, ఆర్టీసీ చార్జీలు, ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలు ఏ విధంగా పెంచేశారో ప్రజలు గ్రహించాలన్నారు.ఈ కా ర్యక్రమంలో టిడిపి జిల్లా ప్రచార కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్, నాయకులు, వాడపల్లి మహేష్, మస్తాన్, సిరారుద్దీన్ పాల్గొన్నారు.


పాలిసెట్ కోచింగ్ ప్రారంభం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఉచిత పాలీసెట్ కోచింగ్‌కు విద్యార్థుల నుండి విశేష స్పందన లభించినట్లు స్థానిక పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఎన్ రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఏఏఎన్ ఎం అండ్ వివిఆర్ఎస్ ఆర్ కళాశాలలో సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉచిత పాలిసెట్ కోచింగ్‌ను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి సుమారు 500 పైగా విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కొంతమంది విద్యార్థులు పాలిసెట్ కోచింగ్ అవగాహన లేకుండా పాలిసెట్ ఎంట్రన్స్ రాయటం వల్ల క్వాలిఫైడ్ కాకపోవటంతో ప్రభుత్వం అందించే విద్యాదీవెనకు అర్హత కోల్పోతున్నారని అన్నారు. అనుపవజ్ఞులైన అధ్యాపకులచే అందిస్తున్న ఈ కోచింగ్ ద్వారా కచ్చితంగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించవచ్చు అని ఆయన తెలిపారు. తద్వారా ప్రభుత్వ అందించే విద్యా దీవెన పొంది సంవత్సరానికి 25 వేలు చొప్పున మూడు సంవత్సరాలకు 75 వేల రూపాయలు ప్రభుత్వం అందించే విద్య దీవెనకు అర్హత పొందొచ్చని తెలిపారు.

సంస్కృత సంభాషణలపై శిక్షణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం ఆలయ ఇఒ కె.ఎస్.రామరావు దేవస్థానానికి అనుబంధంగా పోరంకిలో ఉన్న స్మార్థ వేదపాఠశాలకు విచ్చేసి సంస్కృతభారతీ, ఆంధ్రప్రదేశ్ సంస్థ చేత పాఠశాలలోని వేదవిద్యార్థులకు సంస్కృతంలో సంభాషణ నేర్పుకునేందుకు 10 రోజుల నిడివి గల 'దశదిన సంస్కృత సంభాషణ శిబిరం'ను సోమవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు సంస్కృత భాష ప్రాముఖ్యతను, అమ్మవారి సుప్రభాతం గురించి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంస్కృత భారతీ ట్రస్ట్ కార్యదర్శి, సంచాలకులు డాక్టర్ యు.వి.రమణ మూర్తి, సంస్కృత భారతీ ఆంధ్రప్రాంత బాలకేంద్ర ప్రముఖ్ అరుణ శ్రీ విచ్చేసి విద్యార్థులకు సంస్కృత భాష ప్రాముఖ్యత, ఆవశ్యకతను తెలిపి శిబిరంలో తరగతులు ప్రారంభించారు. అనంతరం ఇఒ సమక్షంలో విద్యార్థులకు వివిధ దశల సంస్కృత భాష పుస్తకాలు, అమ్మవారి సుప్రభాతం పుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేద విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆసక్తి చూపించారు. ఈ కార్యక్రమంలో వేదపాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్ముఖేష శాస్త్రి, ఉపాధ్యాయులు, ఆలయ ఇఇ లింగం రమ, డిఇఇ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

3 నుంచి చేతివృత్తుల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావ నారాయణ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీ నుంచి మహిళలకు వివిధ చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణా తరగ తులను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా ఆ కళాశాల కార్యాలయ ప్రాంగణంలో శిక్షణా తరగతుల పోస్టర్‌ను డాక్టర్ వి.నారాయణరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 సంవత్సరాల నుంచి మహిళలకు వివిధ చేతి వృత్తుల్లో శిక్షణనిస్తు వారిని తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అదే క్రమంలో ఈ ఏడాది సైతం ఈ నెల మూడో తేదీ నుంచి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్స్, గ్రాఫిక్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటిషియన్, ఫ్యాషన్ స్టైలింగ్, ఫాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్, సాండ్, పాట్ పెయింటింగ్, ఇంటీరియర్ డిజైనింగ్, జ్యూవెలరి మేకింగ్, మెహంది డిజైన్స్, డైయింగ్ అండ్ ట్రేయింగ్, ఆన్‌లైన్ పర్చేజింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే బాలబాలికలకు స్పోకెన్ ఇంగ్లీష్, స్పోకెన్ హిందీ, పెయింటింగ్ అండ్ డ్రాయింగ్, వేదిక్ మాథ్‌మెటిక్స్, కంప్యూటర్ బేసిక్స్, క్లాసికల్ సింగింగ్, మ్యాథ్స్ గేమ్స్ అండ్ లెర్నింగ్ మోడల్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ గేమ్స్, డాన్స్ తదితర అంశాల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తామని వివరించారు. ఇప్పటికే కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కే రామకష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, అధ్యాపకులు వీ శైలజ, కల్మబేగం తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - ఒకరు మృతి

ప్రజాశక్తి - తిరువూరు : చింతలపాడు – ఎరుకోపాడు గ్రామాల మధ్య చెరువు కట్టపై సోమవారం ఎదురెదురుగా వస్తూ రెండు ఆటోల ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం... గానుగపాడు దళిత పేటకు చెందిన కొంత మంది గంపలగూడెం మండలం గొల్లపూడి గ్రామంలో బంధువులు చనిపోయారని వెళ్తుండగా ఎరుక పాడు చెరువుకట్ట రోడ్డులో కూలీలతో ఎదురుగా వస్తున్న అటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గానుగపాడు ఆటో పల్టీ కొట్టడంతో బంకా ఆనందరావు(50), మేకల ఎల్లమ్మ(60) తీవ్రగాయాపాలయ్యారు. మరో ఏడుగు రికి స్వల్ప గాయాలయ్యాయి. వీరందరినీ తిరువూరులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆనందరావును మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిపిఎం అభ్యర్థిని గెలిపించుకుందాం : చిరు వ్యాపారులు, కార్మికులు

బాబూరావు పాదయాత్రకు మద్దతుగా రాఘవయ్య పార్కు వరకు భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడను మారుద్దాం సిపిఎం పాదయాత్ర కార్యక్రమం సోమవారం సాయంత్రం పెద్ద ఎత్తున జరిగింది. సెంట్రల్ నియోజకవర్గంలోని లెనిన్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర సోనోవిజన్ మీదుగా ఏలూరు రోడ్డు, తుమ్మిడి బ్రదర్స్ నుంచి బీసెంట్ రోడ్డు–రాఘవయ్యపార్కు వరకు సాగింది. బీసెంట్ రోడ్డులోని హాకర్స్, కార్మికులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, సానుభూతి పరులు వందలాది మంది పాల్గొని వారి సంఘీభావాన్ని తెలిపారు. గెలిపించుకుందాం హాకర్స్ సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థిని, మద్దతునిద్దాం సిపిఎం అభ్యర్థికి, చిరు వ్యాపారులకు అండగా నిలిచే సిపిఎంను గెలిపించాలంటూ పాదయాత్ర పొడవునా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.తమ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావుకు హాకర్స్, చిరు వ్యాపారులు శాలువా కప్పి, పూల మాలతో ఘనంగా హాకర్స్ స్వాగతం పలికారు. కార్యక్రమానుద్దేశించి బాబూరావు మాట్లాడుతూ...సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థికి బీసెంట్ రోడ్డు హాకర్స్, చిరు వ్యాపారులు, కార్మికులు, ఆయా వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతునిచ్చి


పాదయాత్రలో బాబూరావుపై పూలవర్షం కురిపించిన కార్మికులు

గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అనుసరించిన విధానాల వల్ల చిరు వ్యాపారాలు చిద్రమవుతున్నాయని, రుణ సదుపాయం లేక, అధిక వడ్డీలపై రుణాలు తీసుకుంటూ చిరు వ్యాపారులు అప్పులు ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, పార్టీ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, కోటా కళ్యాణ్, నాయకులు వై సుబ్బారావు, బి లక్ష్మణరావు, వెంకటేశ్వర రెడ్డి, కాజా సరోజ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ దుర్గశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విజయవాడ వెస్ట్ ఎసిపి మురళీకృష్ణా రెడ్డి మాట్లాడుతూ విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కాంతి రానా టాటా ఆదేశాల మేరకు వన్‌టౌన్ ఏరియా లిమిట్స్‌లో ఎన్నికల నిర్వహణ దష్ట్యా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారన్నారు. పారా మిలటరీ సిబ్బంది, లోకల్ సిబ్బందితో ఈ మార్చ్ ఫాస్ట్ నిర్వహించామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు



పాల్పడినా, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ శాంతియుతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని వారికి ధైర్యం నింపడానికి ఈ మార్చ్ ఫాస్ట్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్‌లు, పారామిలటరీ ఫోర్స్, వెస్ట్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాని, ఆసిఫ్ ప్రచారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ అభ్యర్థి ఆసిఫ్‌తో కలిసి ఎం.పి అభ్యర్థి కేశినేని నాని 56వ డివిజన్‌లో సోమవారం విస్తృత ప్రచారం చేశారు. రాజరాజేశ్వరిపేటలో గడపగడపకూ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, పనులను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కేశినేని నాని మీడియాతో మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో అధికారం కోసం బిజెపి, జనసేనతో కలిసి పొత్తు పెట్టుకుని 650 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదని చెప్పారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని గ్రహించి 2018లో ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి నాడు తనతోనే అవిశ్వాస తీర్మానం పెట్టించారని గుర్తుచేశారు. అటువంటి బిజెపితో మళ్లీ ఎందుకు పొత్తు పెట్టుకున్నారని ప్రశ్నించారు. కూటమి పేరుతో సుజనా చౌదరికి పశ్చిమ సీటును అమ్ముకున్నారని



ధ్వజమెత్తారు. ఇప్పుడు కూడా పశ్చిమ ప్రజలు ఆయనకు ఓటు వేసి గెలిపిస్తే కనీసం సుజనా చౌదరిని కలిసే అవకాశం కూడా ఉండదని తెలిపారు. స్థానికుడు, అందుబాటులో ఉండే ఆసిఫ్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలోని పేదలను ఇబ్బంది పెట్టడం, పెత్తందారులకు మేలు చేయడమే టీడీపీ అధినేత చంద్రబాబు లక్ష్యమని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, మహాదేవ్ అప్పాజీ, మరుపిళ్ల రాజేష్, కొట్టిరెడ్డి, చైతన్య రెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

6న ఐఎఐసిఎస్ ప్రథమ వార్షికోత్సవం

: డాక్టర్ వరుణ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 6న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్ (ఐఎఐసిఎస్) ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ చైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ తెలిపారు. ఈ సభ హోటల్ తాజ్ వివంతాలో నిర్వహించనున్నట్లు చెప్పారు. బెంజ్ సర్కిల్ సమీపంలోని డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్‌అఓ సోమవారం నిర్వహించిన విలేకరుల సామవేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభలో విదేశాల నుండి 100 నుండి 150 మంది వరకు ప్రముఖ సర్జన్స్ పాల్గొంటారని తెలిపారు. తాను స్థాపించిన రాధా లక్ష్మి హార్ట్ ఫౌండేషన్ సహకారంతో కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యులైన పాడి రైతులకు అందిస్తున్న ఉచిత వైద్య సేవల ముగింపు సందర్భంగా ఈ సభ జరుగుతోందని ప్రజలందరికీ అత్యాధునాతన గుండె వైద్యం అందుబాటులోకి రావలసిన అవసరం గురించి ఈ సభలో


మాట్లాడుతున్న డాక్టర్ వరుణ్

చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ అత్యాధునిక వైద్యాన్ని మారుమూల గ్రామీణ ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చిన డాక్టర్ వరుణ్ దేశ విదేశాల్లో ఉన్న ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్‌తో విజయవాడ వేదికగా అసోసియేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తమ యూనియన్ సభ్యులైన 1700 మందికి పైగా పాడి రైతులకు ఇప్పటి వరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారని వారిలో 940 మందికి గుండె సంబంధ సమస్యలున్నట్లు ప్రాథమికంగా గుర్తించి, యాంజియో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి స్టంట్లు అమర్చుతున్నారని, ఇంకా అవసరమైన వారికి బైపాస్ సర్జరీలతో పాటు అత్యంత ఖరీదైన 'టావీ' చికిత్స కూడా ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇటువంటి ఆదర్శవంతమైన సేవలు ఐఎఐసిఎస్ వేదికగా దేశవ్యాప్తింగా విస్తరించాలన్నారు.


సమావేశానికి హాజరైన వసంత

బూత్ క్లస్టర్ యూనిట్ సభ్యుల సమావేశం


ప్రజాశక్తి - మైలవరం : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని స్థానిక శాసన సభ్యులు, నియోజకవర్గ ఉమ్మడి టిడిపి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. మైలవరం నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చలవాది కళ్యాణ మండపంలో బూత్ క్లస్టర్ యూనిట్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటు ఎంతో కీలకమని అన్నారు. ఈ సందర్భంగా బూత్ క్లస్టర్ యూనిట్ సభ్యులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - విస్సన్నపేట : మండల కేంద్రంలో వైసిపి పార్టీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్ సమక్షంలో మైనారిటీ ఎస్సీ సామాజిక వర్గాల నుండి సోమవారం టిడిపి జనసేన నుండి 30 కుటుంబాలు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపిపి పిల్లి మెర్సివనజాక్షి, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎన్.వి.కుటుంబరావు, మాజీ వైస్ ఎంపిపి ఓలేటి దుర్గారావు, జిల్లా నాయకులు అను మోలు శివ బాజీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 'మతోన్మాద ఎన్‌డిఎ కూటమి కావాలా, అధికారంలోకి వస్తే ఆంధ్రాకు ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తామని చెబుతున్న రాహుల్ గాంధీ ఉన్న, కమ్యూనిస్టులు ఉన్న ఇండియా కావాలా? ప్రజలే ఆలోచించి ఓటు వేయాలి' అని సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఐ నగర మాజీ కార్యదర్శి కొరగంజి శేఖర్‌బాబు 19వ వర్ధంతి కార్యక్రమం సోమవారం వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో నిర్వహించారు. శేఖర్‌బాబు చిత్రపటానికి వారు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మోడీ, జగన్ ఇప్పటి వరకు అధికారంలో ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. అభివృద్ధి దిశగా నడిపించగల దార్శనికత కలిగిన కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లతో కూడిన ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా కార్మిక చట్టాలను మార్చివేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని దాము, డి.వి.రమణ బాబు, కొడాలి అనందరావు, తూనం వీరయ్య, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దోనేపూడి శంకర్

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన నవభారతి



నవభారతిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : పిల్లల అభ్యున్నతికి పాటు పడటం ద్వారా దాసరి నవభారతి ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. సోమవారం గన్నవరం చింతలపేట ఎంపీపీ స్కూలులో హెచ్ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన దాసరి నవ భారతి సన్మాన కార్యక్రమం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగింది. పిల్లల తల్లిదండ్రులు నవభారతికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ నూర్జహాన్ మాట్లాడుతూ... పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించడంతో పాటు, జీవితంలో మంచి పౌరులుగా ఎదగడానికి అవసరమైన మార్గాన్ని ఆమె చూపించారని పేర్కొన్నారు. పాఠశాల అభివద్ధికి ఎంతో కషి చేశారని చెప్పారు. ఇటువంటి హెచ్ఎంలుంటే ప్రభుత్వ పాఠశాలలకు ఎంతో పేరు వస్తుందన్నారు. టీచర్ ఎన్ఎస్ కుమారి మాట్లాడుతూ.. మంచికి మారుపేరుగా నవ భారతి నిలిచారని చెప్పారు. ఆమెతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నవభారతి మాట్లాడుతూ.. తన సుదీర్ఘ 40 ఏళ్ల టీచర్ ప్రయాణంలో ఒడిదుడుకులను, ఆటుపోట్లను చూశానని, పిల్లల అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా పాటుపడినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీచర్లు పి.రమణాదేవి, కె.వి పద్మావతి, తల్లిదండ్రులు నాగమణి, స్వరూప, స్వప్న, రాజారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో ప్రపంచమే కుగ్రామంగా తయారైన పరిస్థితుల్లో యువకులు కంప్యూటర్ శిక్షణ పొందడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకా శాలు అందిపుచుకోవచ్చని రిటైర్డు ప్రొఫెసర్ శివప్రసాద్ అన్నారు. నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరా మయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ జ్యోతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణా తరగతులను సోమవారం శివప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో కంప్యూటర్ శిక్షణా తరగతు లు నిర్వహించడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కంప్యూటర్ యుగంలో మానవ మేదస్సు తగ్గి సాంకేతికత పెరుగు తున్న నేపథ్యంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి కె స్వరూపరాణి, ట్రెజరర్ నీరజ, నూకల సాంబశివరావు, పరుచూరి శ్రీనివాసరావు, రోటరీక్లబ్ చైర్మన్ వెంకటే శ్వరరావు, విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె శివనాగేంద్రం, గో పాల్ తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతును సత్కరిస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

సబ్సిడీపై దాణా, గడ్డి విత్తనాల పంపిణీ : చైర్మన్ చలసాని

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్:: మేలుజాతి పశువుల అభివృద్ధి ద్వారా పాల ఉత్పత్తిని పెంచు కోవచ్చని, అందుకోసం కృష్ణా మిల్క్ యూనియన్ మేలుజాతి పశువీర్యాన్ని (సెమన్) సబ్సిడీపై రూ.50 కే అందిస్తోందని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పాడిరైతు సంక్షేమం మన మతం- అలుపెరుగని సేవ మన అభిమతం అనే కార్యక్రమంలో భాగంగా హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని కృష్ణవరం, పి.సూరవరం సొసైటీ లను సోమవారం ఆయన సందర్శించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. విజయ డెయిరీకి పాలుపోసే పాడిరైతుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. అత్యధిక పాలసేకరణ ధరతో పాటు సంవత్సరానికి మూడుసార్లు బోనస్ చెల్లిస్తూ పాడిరైతు సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తోందని ఆయన వాపోయారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు దాణా, గడ్డి విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని రైతులు సద్వినియోగు చేసుకోవా లన్నారు. అనంతరం పలువురు రైతులను చైర్మన్ సన్మానించారు.ఈ కార్యక్రమాల్లో మేనేజర్ కీలారి కిరణ్ కుమార్, సంఘ అధ్యక్షులు, సంఘ పాలక వర్గ సభ్యులు, సూపర్ వైజర్ మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఫార్మసీ ఆరోగ్య రంగం ఒక ప్రముఖ రంగంగా రూపుదిద్దుకుంటుందని జేఎన్టీయూ హెడ్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ బి. భవాని అన్నారు. స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల లో సోమవారం 14 వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కాకినాడ జేఎన్టీయూ నుండి ముఖ్య అతిథిగా చేసిన ప్రొఫెసర్ భవాని మాట్లాడుతూ ఫార్మసీ ఆరోగ్య రంగంలో విద్య, ఉద్యోగ వ్యాపార అవకాశాలు మెరుగవుతున్నాయని అన్నారు. జీవితంలో ఒక గొప్ప లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ దిశగా అంకితభావంతో విద్యార్థులు పయనించాలని తెలిపారు. తొలుత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ లక్ష్మణరావు కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. పూర్వ విద్యార్థి ఎస్ సాయినాథ్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు బీఫార్మసీ నాలుగో సంవత్సరం అకడమిక్ టాపర్ పి. భార్గవికి 10 వేల నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కతిక, నత్య ప్రదర్శన అందర్నీ ఆకర్షించింది. సంస్కతిక, ఆటల



గెలుపొందిన వారికి బహుమతులు అందించిన దృశ్యం

పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమొంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఈవి రామారావు, ఎస్ ఆర్ జి ఇ సి కళాశాల సెక్రెటరీ వల్లూరు పల్లి రామకష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ బి. కరుణకుమార్ వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి కోదండ రామారావు, ఎంఆర్సిహెచ్ శాస్త్రి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఎం కామరాజు, డాక్టర్ పి రవీంద్రబాబు, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఎం రాజశేఖర్, మెంటార్ రామాంజనేయులు, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెడనలో ఉప్పాల రాము ప్రచారం



ప్రజాశక్తి-పెడన : మానవత దక్పథంతో ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని నియోజకవర్గ వైసిపి శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము ఉన్నారు. స్థానిక 6,7,8 వార్డులలో ప్రజా దీవెన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకులు వరకు ఉప్పాల రాంప్రసాద్ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, ఆయన అడుగుజాడల్లోని తాను కూడా నడుస్తున్నట్లు చెప్పారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బళ్ళా జోష్ణ రాణి గంగయ్య, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, మెట్ల గోపి, గరికముక్కు చంద్రబాబు, సతీష్ బాబు పాల్గొన్నారు.



ఉపాధి కూలీ రూ.600 ఇవ్వాలి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నీరు గార్చడానికి కుట్ర పన్నుతోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శీలం ప్రకాష్‌రావు అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కనకవల్లి గ్రామంలో పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి లక్ష ఇరవై కోట్లు ఉండవలసిన బడ్జెట్ కేవలం 68 వేల కోట్లుకి మాత్రమే ప్రవేశపెట్టారని, దీనివల్ల పని దినాలు తగ్గిపోయి కూలీ లకు జీవనోపాధి సమస్య ఏర్పడుతుందన్నారు. కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, మంచి నీరుకి, గడ్డపారకు డబ్బులు ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, పని ప్రదేశాలలో కూలీలు చనిపోతే 10 లక్షల ఎక్స్ర్గేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మరీదు లక్ష్మి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

‘ఉషారామా’లో ప్రాజెక్టు నమూనాల ప్రదర్శన





ప్రజాశక్తి-ఉంగుటూరు : విద్యార్థులు చదువుతోపాటు టెక్నికల్ అండ్ టెక్నాలజీ విభాగాలలో స్వశక్తితో ప్రత్యేకంగా తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించడం అభినంద నీయం అని ఈసీఈ విభాగ అధిపతి డాక్టర్ భత్తుల నాంచారయ్య అన్నారు. సోమవారం తేలప్రోలు ఉషా రామా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ సీ ఈ విభాగం ప్రాజెక్ట్ ఎక్స్పో కో ఆర్డినేటర్ కె బాబూరావు, ఎం కె.కిషోర్, జి సునీత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా 45 ప్రాజెక్టులతో కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివిధ టెక్నాలజీలను ఉపయోగించి కొత్త కొత్త ఆలోచనలతో ప్రాజెక్టులను రూపొందిం చారు. ఈ ప్రాజెక్టులను వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులకు ఆ అంశాలను వివరించారు, ఈ ప్రాజెక్టు ప్రదర్శనలో 5జీ కమ్యూనికేషన్, రోబోటెక్స్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వి ఎల్ ఎస్ ఐ ఎంబెడెడ్ సిస్టమ్స్, యాంటినా ,మెషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి టెక్నాలజీలో ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాంచారయ్య మాట్లాడుతూ కొత్త కొత్త విషయాలను కనుగొనడం ద్వారా విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని, సజనాత్మకతను వెలికి తీసేందుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రదర్శనకి కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, కళాశాల డైరెక్టర్ కుర్ర రాజశేఖరరావు, ప్రిన్సిపల్ జీ వీ ఎస్ వి ప్రసాద్, కళాశాల డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ సిహెచ్ శాంతి రాణి, ఇతర విభాగ అధిపతులు ఉపాధ్యాయులు విచ్చేసి ప్రాజెక్టు వివరాలను తెలుసుకొని విద్యార్థులకు అభినంద నలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగ తోటి అధ్యాపకులకు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను వినియోగించుకోండి : మేనేజర్

ప్రజాశక్తి-చల్లపల్లి స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించడం కోసం చల్లపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకులో డిజిటల్ సేవలైన మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయని మేనేజర్ పి రమేష్ తెలిపారు. స్థానిక ప్రధాన కూడలి లో కాన్వాయ్ నిర్వహించి వ్యాపారస్తులను కలిసి బ్యాంక్ సేవలను వివరించారు. ఖాతాదారుల సౌలభ్యం కొరకు అన్ని రంగంలో వారికి అనువైన రుణ సదుపాయంలో సరళమైన వడ్డీరేట్లు అందిస్తున్నా మని, డిపాజిట్ల పైన అత్యధిక వడ్డీరేట్లను అందిస్తున్నము అని బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీతో ఖాతాదారులకు సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ వి తేజేంద్ర గోల్డ్ అప్రైజర్ నాగబాబు బ్యాంక్ సిబ్బంది అనిల్ పాల్గొన్నారు

జీవితంలో వ్యాయామం ఓ భాగం కావాలి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ప్రతిఒక్కరూ తమ నిత్య జీవితంలో వ్యాయామాన్ని ఒక భాగంగా అలవర్చుకోవాలని, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా వ్యాయమ ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజీ ఎస్-జే కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం 'వ్యాయమ ఉపాధ్యాయులకు మాడ్యూల్ రూపకల్పన' కోసం ఐదు రోజుల పాటు రెసిడెన్షియల్ వర్క్‌షాప్‌ను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటముల ద్వారా ఒత్తిడిని జయించే సామర్థ్యం క్రీడాకారులకే మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. కలిసి పని చేయడం, సమస్యను పరిష్కరించుకోవడం వ్యాయామ విద్య ద్వారా కలుగుతుందని అన్నారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసమే కాకుండా శరీరం దృఢత్వం, మనోధైర్యం, ఆత్మ విశ్వాసాలు కూడా ఏర్పడతాయన్నారు. జిల్లాల్లోని ఏ ప్రాంతాల్లో ఏయే క్రీడలకు ప్రత్యేకత ఉందో పరిశీలించి శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. వచ్చే



విద్యా సంవత్సరంలో అకడమిక్ క్యాలెండర్ రూపకల్పనలో క్రీడాంశాలకు పీరియడ్లు తప్పక కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, సమగ్ర శిక్షా ఏఎస్పీడీ డా. కె.వి. నివాసులురెడ్డి, 40 మంది వ్యాయమ విద్య సబ్జెక్టు నిపుణులు పాల్గొన్నారు.





చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉన్న నేపథ్యంలో సోమవారం విజయవాడ ఆర్‌డీవో, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఆర్‌వో బీహెచ్ భవానీశంకర్ వివిధ చెక్‌పోస్టులను ఆకస్మికంగా సందర్శించారు. వారధి, ఆటోనగర్, రామవరప్పాడు రింగ్ చెక్‌పోస్టులను పరిశీలించి తనిఖీలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అక్రమంగా నగదు, మద్యం, విలువైన లోహాలు వంటి వాటి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సిబ్బంది నిరంతర నిఘా, అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎంసీసీ బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు.

రామ్‌మోహన్‌మిశ్రాకు స్వాగతం

ప్రజాశక్తి-విజయవాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 1987 బ్యాచ్‌కి చెందిన రిటైర్డు ఐఎఎస్ అధికారి రామ్‌మోహన్‌మిశ్రాను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ జనరల్ అబ్జర్వర్ గా ఇటీవల నియమించింది. సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి నగరానికి చేరుకున్న స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రాకు నోవాటెల్ వద్ద రాష్ట్ర ప్రధాని ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ స్వాగతం పలికారు.





టాలెంట్ టెస్ట్‌లో నాగార్జున విజయకేతనం

ప్రజాశక్తి - తిరువూరు : హైదరాబాద్ కు చెందిన లిటిల్ చాంప్స్ అకాడమి యూ డి ఆర్ట్ కండక్ట్ రైటిస్ మాథ్స్, సైన్స్ ఇంగ్లీష్ టాలెంట్ టె స్టులో తిరువూరు నాగార్జున పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎ.శ్రీశారద మనస్వి (7వతర గతి) రూ.2500 క్యాష్ ప్రైజ్‌తో పాటు మెమెంటో, ఎస్.జస్వంత్ (4వతరగతి) రూ.500 క్యాష్ ప్రైజ్‌తో పాటు మెమెంటోను పొందినట్లు ప్రిన్సిపల్ కె.నర సింహారావు తెలిపారు. మిగిలిన విద్యార్థులు మెమెంటో, గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. విజేతలను సోమవారం పాఠశాలలో కరెస్పాం డెంట్ వి.నాగేశ్వరరావు, వైస్‌ప్రిన్సిపాల్ ఆర్. సురేష్, కళాశాల డైరక్టర్స్ కె.శేషగిరి రావు, డి.హనుమంతరావు, టి.సూరి బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

గన్ షాపుల తనిఖీ

ప్రజాశక్తి-విజయవాడ

డిప్యూటి పోలీస్ కమిషనర్ అధిరాజ్ సింగ్ రాణా పోలీస్ అధికారులతో కలిసి నగరంలోని గవర్నర్ పేట, మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్స్, ఆమ్యునేషన్ షాపులను తనిఖీ చేసి నిర్వాహకులకు గన్స్ ఆమ్యునేషణ్‌ల నిర్వహణపై పలు సూచనలు అందించారు.ఈ సందర్భంగా డి.సి.పి.గారు షాప్ లను తనిఖీ చేసి లైసెన్స్ కలిగిన గన్స్, ఆమ్యునేషన్‌లను మాత్రమే ఉంచాలని డిసిపి ఆదేశించారు. అన్ని వెపన్స్ డిపాజిట్ చేశారా, ఇంకా ఎవరైనా చేయవలసిన వారు ఉన్నారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. షాప్ లోని రికార్డులను డిపాజిట్ చేసిన వెపన్స్ వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. షాప్ లను నిర్వహించు నిర్వాహకులకు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిపాజిట్ చేసుకున్న



వెపన్స్ బయటకు పంపకూడదని, షాప్ చుట్టూ నిరంతరం సి.సి.కెమెరాలను, సెక్యూరిటి గార్డులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసుకోవాలని, షట్టర్లకు డబుల్ లాక్స్ లను ఏర్పాటు చేసుకోవాలని డిసిపి ఆదేశించారు. పర్మిషన్ ఉన్న పర్సనల్ , కమర్షియల్ వెపన్స్ లను మాత్రమె డిపాజిట్ చేసుకోవాలని షాప్ యజమానులకు డిసిపి ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధి హామీ ద్వారా 80 లక్షల పని దినాలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ఉపాధి హామి పథకం ద్వారా పని కోరిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని, 80 లక్షల పని దినాలను కల్పించాలనే లక్ష్యం కాగా ప్రతి వారం 5 లక్షల పని దినాలను కల్పించేందుకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాట్లు జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. ఉపాధి హామి, తాగునీటి సరఫరా, పెన్షన్ పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మాట్లాడుతూ ఉపాధి హామి పథకం ద్వారా జిల్లాలో పని కోరిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వారానికి 5 లక్షల పని దినాలు కల్పించే లక్ష్యంతో ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామి ద్వారా చెరువులు పూడిక తీత, డొంక రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి, మొక్కలు నాటడం వంటి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కూలీలకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా వేకువ జామునే పనులు మొదలు పెట్టి ఉదయం 10 గంటల వరకు మాత్రమే పనులు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. పనులు జరిగే ప్రాంతాలలో కూలీలకు గ్రీన్ షేడ్స్, తాటీ, ఈత ఆకులతో తాత్కాలిక పందిళ్ళు వేసేలా చర్యలు తీసుకున్నామని, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో మెడికల్ కిట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్దంగా



మాట్లాడుతున్న కలెక్టర్ డిల్లీరావు

ఉంచుతున్నామని, గ్రామ పంచాయతీ సహకారంతో చల్లటి త్రాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ప్రస్తుత వేసవిలో త్రాగునీటి ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తున్నామన్నారు. ప్రకాశం బ్యారేజ్‌లో ప్రస్తుతం 5.2 టియంసిల నీటి నిల్వలు ఉన్నాయని 1.5 టియంసిల వరకు త్రాగు నీటికి ఎటువంటి ఇబ్బంది ఉండదని వివరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటి చెరువులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపేలా చర్యలు తీసుకున్నామన్నారు. మెట్ట ప్రాంతాలలో బోర్ వెల్స్ పరిశీలించి, మరమ్మతులు అవసరమైన వాటికి మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వడగాల్పులు కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు వేడిగాల్పులకు గురి కాకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డ్వామా పిడి జె. సునీత, డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డి వెంకటరమణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

'హాలివుడ్' మోసం

మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.20 కోట్ల వరకు యువకులు కంపెనీకి కట్టారని, ఆ డబ్బులు ఇవ్వాలని కోరితే పోలీసులతో కేసులు పెట్టించి జైలుకు పంపుతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని తెలిపారు. ఈవిషయమై కంపెనీ హెచ్‌ఒడితో మాట్లాడేందుకు మీడియా ప్రయత్నించగా స్పందించలేదు. ఈ కార్యక్రమంలో బాధిత యువకులు ఎం.సాయి, కె.పవన్, సిహెచ్.రూబెన్, కె.అనిల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. యువకుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎఎంసి మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, టిడిపి నాయకులు నాని అక్కడికి వచ్చి మద్దతు తెలిపారు.

జనసేనలోకి బుద్ధప్రసాద్

పార్టీలోకి రావడాన్ని జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సోమవారం బచ్చు వెంకట్‌నాథ్ కార్యాలయం వద్ద జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పొత్తులో భాగంగా జనసేనకు రాష్ట్రం మొత్తం మీద కేవలం 21 సీట్లు మాత్రమే కేటాయించారని, కాపులు అత్యధికంగా ఉన్న కృష్ణాజిల్లాలో కేవలం ఒక్క సీటు మాత్రమే కేటాయించి ఆ సీట్లో కూడా జనసేన వారికి అవకాశం ఇవ్వకుండా టిడిపిలో పదవులు అనుభవించి ఇప్పుడు పదవి కోసం జనసేనలోకి వచ్చిన వారికి సమంజసం కాదన్నారు. బుద్ధప్రసాదుకు సీటు ఇస్తే తామంతా రాజీనామా చేస్తామని హెచ్చరించారు.

సమాజాన్ని మేల్కొలిపేది ఉపాధ్యాయులే

- కెయు ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి



నియామకపత్రాలు అందిస్తున్న ఉపకులపతి జ్ఞానమణి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : సమాజంలో చైతన్య దీప్తిని ప్రేరేపించే వత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పేర్కొన్నారు. కష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో సోమ వారం చైతన్య విద్యా సంస్థలు వారిచే నిర్వహించిన ప్రాంగణ ఎంపికల లో ఎంపికైన విద్యార్థులకు ఉపకులపతి ఆచార్య జ్ఞానమణి చేతుల మీదుగా నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న వారికి ఇది తొలి మెట్టు మాత్రమే అని, సాధించాల్సింది చాలా వుందని చెప్పారు. తాను విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న తరువాత తొలుత బ్యాంక్ ప్రొబెషనరీ అధికారి ఉద్యోగాన్ని సాధించినా దానిలో స్థిరపడలేదని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో సమయపాలన, కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలని సూచించారు. గణాంక శాస్త్రం, ఆంగ్లం, రసాయిన శాస్త్రం, బోటనీ, జూవాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాలలో ఎంపికైన 48 మందికి నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందర కష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ సమన్వయకర్త డా కిషోర్, చైతన్య విద్యాసంస్థలు డీన్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మున్సిపాలిటీలో జనసేన పార్టీ కార్యాలయాన్ని మచిలీపట్నం లోక్ సభ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు పార్థసారథి, కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, కూటమి పామర్రు అభ్యర్థి వర్ల కుమార్ రాజా, కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్, మాజీ ఎంపీ కొనకల నారాయణ, పెనమలూరు సమన్వయకర్త ముప్పారాజా, పెనమలూరు మండల టిడిపి అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

పోలింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలి: యార్లగడ్డ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్క బీఎల్ తనకు కేటాయించిన బూత్ పరిధిలో చర్యలు తీసుకోవాలని బూత్ లెవెల్ ఏజంట్లకు టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు దిశానిర్దేశం చేశారు.మండల కేంద్రమైన బాపులపాడు, మడిచర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన బీఎల్ ఎల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లోని బూత్లవారీగా పోలింగ్ శాతం గతంతో పోల్చిచూస్తూ – తక్కువగా ఓట్లు పోలయిన బూత్ కమిటీలతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకోవాలని, ఓట్లు లేనివారిని గుర్తించి తక్షణం చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కార్యదర్శి పుట్టా సురేష్, నియోజకవర్గ పోల్మేనేజ్మెంట్ అధ్యక్షుడు ఆళ్ల గోపాలకష్ణ. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గం టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జననేశ్వరి సోమవారం విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలో ఎన్నికప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పగడాల వారి వీధి, అమ్మవారి పుట్టింటి రోడ్డు, చాగంటిపాటి వారి వీధి, లక్ష్మిపతి వారి విధులలో గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. పుంగనా రవి, రామకష్ణంరాజు, మున్నాగి సత్యనారాయణ, పుట్టి నాగరాజు, విజ్జి రాము పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం ఆదేశాలను వక్రీకరించడం తగదు : వైవిబి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-ఉయ్యూరు : వలంటీర్లను పింఛన్లు పంపిణీచేసే విధులనుంచి తప్పించి ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయించాలన్న ఎకలక్షన్ కమిషన్ ఆదేశాలను చీఫ్ సెక్రటరీ జవహర్రెడ్డి వక్రీకరించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి లబ్ది కలిగే విధంగా పింఛను పంపిణీ విధానాన్ని సిద్ధం చేశారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, సర్పంచ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆరోపించా రు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీకి అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని సోమవారం విలేకరుల సమావేశంలో తప్పుపట్టి అధికారుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పింఛన్లు, ఇతర పథకాలు లబ్ధిదారులకు పంపిణీ చేసే విధుల నుంచి తప్పించి వేరే ప్రభుత్వ సిబ్బంది ద్వారా పంపిణీ చేయించమని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశించిందన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం, పార్టీకి, ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికి తొత్తులుగా ఉన్న అధికారులు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు వక్రీకరిస్తూ రాజకీయంగా ఆపార్టీకి లబ్ధికలిగే విదంగా పింఛన్ల పంపిణీ అంశాన్ని తయారుచేశారని విమర్శించారు. ఇంటింటికి వెళ్ళి పింఛన్లు అందించేందుకు పంచాయతీ సిబ్బంది, సర్పంచ్లు సిద్ధంగా ఉన్నారని, సిబ్బంది చాలకపోతే గ్రామ, సచివాలయ కార్యదర్శులు లక్షా 60 వేల మందిచేత ఇంటింటికి వెళ్లి పింఛను ఒక్క పూటలో అందజేసేందుకు అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్, టీడీపీ నాయకులు జంపన శ్రీనివాస్, అజ్మతుల్లా పాల్గొన్నారు.

జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్, స్మారక సంస్థ వ్యవస్థపక అధ్యక్షురాలు కె. హెచ్. ఎస్. జగదాంబ సహకారంతో జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ఆచార్య జి. జ్ఞానమణి భారత స్వాతంత్ర ఉద్యమంలో జాతీయ పతాకం విశిష్టతను గూర్చి వివరిం చారు. అంతేగాక జాతీయ పతాకాన్ని రూపొందిం చిన వ్యక్తి మచిలీపట్నం కు దగ్గరలోని భట్లపెనుమర్రుకు చెందిన పింగళి వెంకయ్య కావడం మనందరికి గర్వకారణం అన్నారు. విద్యార్థులందరూ జాతీయ పతాకాన్ని గౌరవించు కోవాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆవిర్భావ దినోత్సవం ను ప్రత్యేకంగా జరుపుతున్న ఎన్‌సీసీ విద్యార్థులను యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగం అధికారి డాక్టర్ డి. రామశేఖరరెడ్డిని వైస్ ఛాన్సెలర్ జ్ఞానమణి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య శోభన్ బాబు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. విజయ కుమారి పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఉపాధి పనులు ప్రారంభించాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామములో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అలాగేపెందుర్రు గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెందుర్రు సిపిఎం శాఖ కార్యదర్శి రాంబాబు, తోట ఆంజనేయులు, అజయ్ ఘోష్ పాల్గొన్నారు.

చర్చి ప్రారంభోత్సవంలో వివాదం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ దేవాలయం పలు వివాదాలకు కేంద్రంగా మారి రెండు వర్గాలకు బేదాభిప్రాయాలకు కేంద్ర బిందువైంది. మొదటి నుండి నిర్మాణపనులను పర్యవేక్షించిన వ్యక్తిని ఆరోపణలు చేస్తూ నిర్మాణపనుల నుండి తప్పించడంతో అనంతరం నిర్మాణపనులను పర్యవేక్షిస్తున్న వ్యక్తికి బేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఈ బేదాభిప్రాయాలు చర్చి ప్రారంభోత్సవ సందర్భంగా సోమవారం వెలుగులోకి వచ్చాయి. చర్చి ప్రారంభోత్సవంపై గతంలో నిర్మాణపనుల పర్యవేక్షించిన వర్గం తరపున జయప్రకాష్ అనే వ్యక్తి కోర్టుకు వెళ్లగా విషయం తెలుసుకున్న సీఎస్ఐ యాజమాన్యం 3వతేదీన ప్రారంభించాల్సిన దేవాలయాన్ని సోమవారం మధ్యాహ్నం గం2.45 నికు ప్రారంభించి ప్రార్థనలు నిర్వహించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు స్థానిక గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రసాద్, పోలీసుల సాయంతో సాయంత్రం 4 గంటలకు చర్చిప్రాంగణానికి వచ్చి నోటీసులిచ్చేందుకు ప్రయత్నించగా కోర్టువారి అధికారిక ఉత్తర్వులతో నోటీసు ఇస్తేనే తీసుకుం టామని నిర్వహణకమిటీ వారు తిరస్కరించారు. దీనితో సీఎస్ఐ దేవాలయ గోడకు నోటీసును అంటించిన అధికారులు వెనుదిరిగారు. ఎస్సై జనార్ధన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఎటువంటి గొడవలు జరగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

బాలశౌరిపై వ్యాఖ్యలకు టిడిపి ఖండన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ రైతాంగానికి మేలు చేసిన వ్యక్తి బందరు ఎంపీ వల్లపనేని బాలశౌరి అయితే రైతాంగాన్ని నిలువునా ముంచేసిన ఘనత అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకు దక్కిందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం వేదిక ఉమ్మడి అభ్యర్థి బాలశౌరిపై, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆయన సహచరుడు కడవకొల్లు నరసింహారావులు చేసిన వ్యాఖ్యలను టిడిపి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004 సంవత్సరంలో ఎంపీ గా బాలశౌరి గెలిచిన సందర్భంలో దివిసీమ రైతులకు ఎంతో మేలు చేశారని, దానికి కతజ్ఞతగా 2019లో అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు మరోసారి బాలశివునికి పట్టం కట్టారని తెలిపారు. గెలిచిన నాటినుండి నేటి వరకు నియోజకవర్గ పరిధిలో ఆయన చేసిన అభివద్ధి పనులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు రావి రత్నగిరి, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము పవన్ కుమార్, పార్టీ నాయకులు మండలి రామ్మోహన్రావు, బచ్చు రఘునాథ్, ప్రసాద్, బండి రాఘవ, ఎలవర్తి చిన్న మెగావత్ గోపి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

ఇన్నోవేషన్ ఫెయిర్‌లో ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాల్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇన్నోవేషన్ ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు సోమవారం తెలిపారు. జెఎన్‌టియు కాకినాడ యూనివర్సిటీ గత నెల 27, 28 తేదీల్లో ఇన్నోవేషన్ ఫెయిర్‌ను నిర్వహించారన్నారు. సిఎస్‌సి విభాగం నుండి ఐడియా ఎంజన్సింగ్ మొబైల్ సెక్యూరిటీ విత్ యాన్ ఆటోమేటెడ్ సిమ్ శ్లాట్ జంక్షన్ సిస్టం మెచ్చనిస్ అనే అంశంలో ఫైనల్ ఇయర్ విద్యార్థి యు అర్జున్, బి.గ్రేసి, ఎల్.మనీషా పాల్గొని ప్రథమ బహుమతి సాధించారన్నారు. ఈ సందర్భంగా బహుమతి పొందిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ డి.వీరయ్య, కోఆర్డినేటర్లు మెంటార్లు విద్యార్థులు అభినందించారు.



'అమ్మ' ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వేసవిలో దాహం తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు అభినందనీయం అని ఆంధ్ర మోటార్ మర్చంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోనుగుంట వెంకట సుబ్బారావు అన్నారు. నగరంలోని ఆంధ్ర మోటార్ మర్చంట్ హాల్‌లో సోమవారం ఉదయం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తగ్గే వరకు చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ మజ్జిగ, మంచినీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ కార్యదర్శి సుంకర చంద్ర శేఖర్,కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, బోబ్బా నారాయణ రావు,యార్లగడ్డ సుబ్బారావు, కష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగు మోతు, రాజా, ఎం.వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎస్‌ఆర్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ఈ నెల 7న పొరంకిలోని గ్రీన్ స్కూల్‌లో జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లోయిద్దరిని బాలికల కేటగిరీలో, మరో ఇద్దరిని ఓపెన్ కేటోగిరిలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కృష్ణాజిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. అండర్ – 17 ఓపెన్, బాలికల జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ సెలక్షన్స్‌లో పాల్గొంటారని తెలిపారు. అండర్ 7, 9, 11 ,13 15 కేటగిరీలో మొదటి రెండు స్థానాలకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ ఆడాలనుకునేవారు www.apchess.org లో మాత్రమే శనివారం సాయంత్రం ఐదు గంటలకు లోపు రిజిస్టర్ చేసుకోవాలి అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9700775220/ 9247153387 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

పిచ్చుకను రక్షించుకోవటం మన బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఆర్టిస్టులు

విజయవాడ : పిచ్చుకను చేసుకుందామా మచ్చిక అనే నినాదంతో నిర్వహించిన సేవ్ స్పారో నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంటెస్ట్ చిత్రకళా ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. నగరానికి చెందిన స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమీర్ చిత్రకథ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కష్ణ కిరణ్ చిత్రకళా ప్రదర్శనను లాంచనంగా ప్రారంభించారు. అతిథులుగా హాజరైన, గోళ్ళ నారాయణ రావు, ఎస్.పి. రామరాజు, అనిల్ డానీ, ఏడుకొండలు యాదవ్ లు పర్యావరణ పరిరక్షణ, జీవ రాశు ల సంరక్షణకై మనం పోషించాల్సిన పాత్ర గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిచ్చుకల మనుగడకై పాటుపడుతున్న డాక్టర్ వీరా మహేష్, రమేష్ సుంకోజు, పోలుపర్తి దాలి నాయుడును స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ సంస్థ ఘనంగా సత్కరించింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సేవ్ స్పారో నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతలకు క్యాష్ అవార్డులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, ప్రత్యేకంగా చేపించిన బర్డ్ హౌస్ లు వరికంకుల కుచ్చులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షించగా.. జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారులు సునీల్ కుమార్ అనుమకొండ, గిరిధర్ అరసవల్లి, ఎస్ పి మల్లిక్, రమేష్ అర్కాల, కళాసాగర్, శ్రావణ్ కుమార్, సంధ్యారాణి, మేడా రజని, లలితా సౌజన్య, లక్ష్మీ ప్రియాంక, శివాజీ, గోపి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు విజయమిల్క్ సెంటర్ ఆడిటోరియంలో మార్చి 30, 31 తేదీల్లో జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్ట్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. మొదటిగా ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మద్ది ప్రభాకర్, మండల విద్యాశాఖ అధికారి ఎల్.చిట్టిబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అండర్ 17 సంవత్సరాల బాలబాలికలు, అండర్ 19 సంవత్సరాల బాలబాలికలకు ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ పరిశీలకులుగా కె.నాగ శిరీష, ఎన్.శ్రీదేవి ఆధ్వర్యంలో గవర్నమెంట్ నిర్వహించగా 400 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో 20 మంది న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు. రెండు రోజులుగా జరిగిన ఈ పోటీలను చిల్లకల్లు జిల్లా పరిషత్ పాఠశాల, ఎన్టీఆర్ స్కూల్ గేమ్స్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు స్థానిక కోహెన్స్ లైఫ్ సైన్స్ ప్రెసిడెంట్ ఎమ్ఎస్ఎన్.రెడ్డి బహుమతులను అందజేశారు. బాలికల విభాగంలో ఉందర్ 17 స్ట్రాంగ్ గర్ల్‌గా ఏ మాధురి విశాఖపట్నం, స్ట్రాంగ్ బాయ్ అండర్ 17 జి.హేమ వర్ధన్, గుంటూరు అండర్ 19 స్ట్రాంగ్ మెన్‌గా పి.జానుబాబు, అండర్ 19 స్ట్రాంగ్ ఉమెన్‌గా పి.ప్రవళిక ఎంపికయ్యారు. టోటల్ ఓవరాల్ ఛాంపియన్‌గా కృష్ణాజిల్లా ఎంపికైందని ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ ఆర్ సీజర్ రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వేముల వెంకటేశ్వరరావు, గంటా వెంకటేశ్వర్లు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులు

విజయవాడ అభివృద్ధికి సిపిఎంను గెలిపించాలి

మార్పుకోసం 23వ డివిజన్ పాదయాత్రలో బాబూరావు పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : నగర ప్రజలు, వ్యాపారులు, ప్రముఖులు, మేధావులు మన విజయవాడను అభివృద్ధి పథంలో నడిపించడానికి ఈ ఎన్నికల్లో సిపిఎంను గెలిపించి, కమ్యూనిస్టులకు మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 23వ డివిజన్ సూర్యారావుపేట ప్రాంతంలో మార్పు కోసం సిపిఎం పాదయాత్ర ఇంటింటికీ ప్రచారం సోమవారం నిర్వహించారు. వ్యాపార సంస్థలు, ఆసుపత్రులు, వివిధ కార్యాలయాలు అత్యధికంగా ఉన్న ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, మురుగునీరు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాధుడే లేడని సిపిఎం నాయకుల వద్ద స్థానిక ప్రజలు వాపోయారు. వ్యాపార ప్రముఖులు, వైద్యులు, మేధావులను బాబూరావు, నాయకులు కలిసి ఓట్లను అభ్యర్థించారు. బాబూరావు మాట్లాడుతూ కార్పొరేట్ల మేలు కోసం చిన్న, మధ్య తరగతి వ్యాపారులను దెబ్బతీస్తున్న మోడీ సర్కార్, వ్యాపారులను పన్నులతో వేధిస్తున్న జగన్ ప్రభుత్వం అని అన్నారు. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు, కరోనాతో వ్యాపారాలు కుదేలయ్యాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపితో జతకట్టి టిడిపి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను వమ్ము చేసిందని విమర్శించారు. రిటైల్ వ్యాపారంలోకి విదేశీ బడా కార్పొరేట్ల ప్రవేశాన్ని కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తూ, పలు రకాల ఉద్యమాలు నిర్వహించారన్నారు. చిరు వ్యాపారులకు, స్వయం ఉపాధి చేసుకునే వారికి అండగా నిలిచే సిపిఎంకు ఓటు వేయాలని కోరారు. విజయవాడ వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఉండి వేలాది మందికి ఉపాధి చూపుతున్న చిల్లర వర్తకంలోకి బడా కార్పొరేట్ కంపెనీలకు అనుమతి ఇచ్చి కేంద్రం చిన్న, మధ్య తరగతి వ్యాపారులను దెబ్బతీసిందని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం చెత్తపన్ను, విద్యుత్ ఛార్జీలు ఇతర పన్నుల రూపంలో వ్యాపారులను వేధిస్తోందని మండిపడ్డారు. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వకపోగా, కరోనాలో సైతం పెనాల్టీతో సహా వడ్డీలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. వ్యాపార రంగాన్ని ఆదుకుంటామనీ, వ్యాపారుల ప్రతినిధులని చెప్పుకుంటున్న వైసీపీ నేతలు వ్యాపారులను పీడిస్తున్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ...సిపిఎంకు ఓటు వేయడమంటే చెత్త పన్ను, ఆస్తి పన్ను రద్దుకు, నగరాభివృద్ధికి ఓటు వేయడమని అన్నారు. ఈ ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థికి ఓట్లు వేసి అసెంబ్లీకి పంపించడం ద్వారా ప్రజావాణిని వినిపించడానికి వీలుంటుందని అన్నారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, కోటా కళ్యాణ్, నాయకులు పి.కృష్ణ, కే.సరోజ, వై.సుబ్బారావు, కె.గురుమూర్తి, బి.లక్ష్మణ, పి.మురహరి, కోరాడ రమణ, టి.చంద్ర శేఖర్, కె.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మురుగునీరు పారుతున్న ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడుతున్న బాబూరావు